"అమ్మాయ్! సర్వీస్ కమిషన్ కండక్ట్ చేస్తున్నారట అప్లయ్ చెయ్. గ్రూప్ ఫోర్‌లో ఈ సారైనా క్లర్క్ జాబ్ వస్తుందేమో దేవుడు మేలు చేస్తే!" అన్నాడు కృష్ణమూర్తి కూతురుతో. సరస్వతి "అలాగే నాన్నా!" అంది.

"నాన్నా! క్లర్క్ అంటే నువ్వు చేసే గుమస్తా వుద్యోగమేగా?" ప్రశ్నించాడు రాంబాబు.

"అవును" అన్నాడు కృష్ణమూర్తి.

"నేను గుమస్తాను కాను నాన్నా!" చెప్పాడు రాంబాబు.

కృష్ణమూర్తి నవ్వాడు.

"మరి ఏమవుతావురా?" అన్నాడు.

"ఇంజనీర్ని అవుతా!" అన్నాడు రాంబాబు.

"ఇంజనీర్ కావాలంటే మార్కులు బాగా రావాలి. బాగా చదివి డిస్టింక్షన్ తెచ్చుకోవాలి." చెప్పాడు కృష్ణమూర్తి.

కాని 'నువ్వు డిస్టింక్షన్ తెచ్చుకున్నా, నేను నిన్ను ఇంజనీరింగ్ చదివించే ఆర్థిక స్తోమత లేనివాడివి బాబూ!' అని చెప్పలేక పోయాడు.

పదిహేను సంవత్సరాలు నిండిన రాంబాబుకి ఇప్పుడిప్పుడే లోకం గురించి తెలుస్తోంది.

# పేకమేడ

చిన్నప్పటి నుంచి రాంబాబు కోరికలు ఏవీ తండ్రి తీర్చలేక పోయాడు. కోరికలు చంపుకుని బ్రతకడం అలవాటై పోయింది వాడికి.

ఆరేళ్ళ వయసున్నప్పుడు మూడు చక్రాల సైకిల్ అంటే ఎంతో మోజుగా వుండేది రాంబాబుకి. పక్కింట్లో హెడ్ కానిస్టేబుల్ మనవడు తొక్కుతుంటే ఆశగా చూసేవాడు. తనకూ అటువంటిదే కావాలని తండ్రిని అడిగాడు. 'సరేలే' 'అలాగే' అని చెప్పేవాడు ఎప్పుడూ. తల్లిని పోరు పెట్టేవాడు కొనమని. ఆమెకు కోపం వచ్చి కొట్టేది. ఆ తర్వాత పశ్చాత్తాప పడేది. ఎత్తుకునేది. గుండెలకు హత్తుకుని కన్నీళ్ళు పెట్టుకునేది.

ఆ తర్వాత చాలాసార్లు ఇంట్లో అన్నం వండని రోజులు గూడా రాంబాబుకి గుర్తున్నాయి. తాత కుక్కి మంచంలో దగ్గుతూ పడుకునేవాడు. 'ఈ ముసలాయన ఎప్పుడు పోతాడో. చస్తున్నాం చాకిరీ చెయ్యలేక. ఎక్కడెక్కడో అప్పులు తెచ్చి డాక్టర్లు మందులకు పోస్తున్నాం' అని రాంబాబు తల్లి విసుక్కుంటుండేది.

తాతయ్య చచ్చిపోవడం, తల్లి మెడలో వున్న గొలుసు అమ్మడం, అప్పడు అమ్మా, నాన్న పోట్లాడుకోవడం అన్నీ రాంబాబుకి గుర్తున్నాయి.

పండుగలొచ్చినా కొత్త బట్టలు కుట్టించేవాడు కాదు తండ్రి. ఎప్పుడో సంవత్సరానికొకసారి ఫలానా కంపెనీ వాళ్ళు అప్పు ఇస్తున్నారని తెచ్చేవాడు. అవి రాంబాబుకి నచ్చేవి కావు. అయినా తప్పేది కాదు



తొడుక్కోక.

ఎదురింట్లో వున్న ఇంజనీర్ అంకుల్ ఇంటికి వెళ్తే రాంబాబుకి కళ్ళు చెదిరి పోయేవి. వాళ్ళింట్లో అన్నీ వస్తువులున్నాయి. రాంబాబు ఇంట్లో ఏమీ లేవు.

రాంబాబు గట్టిగా నిశ్చయించుకున్నాడు తను తండ్రిలా గుమస్తా కాకూడదు. ఇంజనీర్ అవ్వాలి. అందుకని బాగా చదువుకోవాలి.

అప్పట్నుంచి రాంబాబు శ్రద్ధగా చదువుకోసాగాడు.

పదో క్లాసు ఫస్ట్ క్లాసులో ప్యాసయ్యాడు.

'ఇంజనీర్ కావాలంటే ఏ గ్రూప్ తీసుకోవాలని' మాష్టార్ని అడిగి తెలుసుకున్నాడు.

ఎమ్.పి.సి. గ్రూప్ తీసుకుని జూనియర్ కాలేజీలో చేరాడు రాంబాబు

"కాలేజీలో సరిగా చెప్పడం లేదు నాన్నా! ట్యూషన్‌కి వెళ్తాను" అని తండ్రిని అడిగాడు రాంబాబు.

కృష్ణమూర్తి సరే అన్నాడు. ట్యూషన్ ఫీజు సబ్జెక్ట్‌కి ఐదొందలు. గ్రూప్‌కి, ఇంగ్లీష్‌కి కలిపి రెండు వేలు కట్టాలని చెప్పినప్పుడు కృష్ణమూర్తి కుంగి పోయాడు. ఒక్కసారే రెండు వేలు ఎవరిస్తారు? ఇదుగో, అదుగో అని రోజులు దొర్లిపోతున్నాయి. తనకి తండ్రి ట్యూషన్ చెప్పించలేడని రాంబాబు అర్థం చేసుకున్నాడు.మళ్ళీ అడగలేదు. ఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళి నోట్స్ రాసుకుని వాళ్ళతో తెలియనివి అడిగి చెప్పించుకుని చదువుకున్నాడు.

ఇంటర్ రెండో సంవత్సరం ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయ్యాడు రాంబాబు. ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌కి పరీక్ష

## సి.ఎస్.ఆర్. ప్రసాద్

రాశాడు. గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీలో సీటొచ్చింది. అయినా కోర్సు పూర్తయ్యేటప్పటికి కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతాయని తెలిసి కృష్ణమూర్తి నిస్సహాయంగా క్రుంగిపోయాడు.

రాంబాబుకి ఇంజనీరింగ్‌లో సీటొచ్చిందని తెలిసి దూరపు చుట్టం ఒకాయన వాడి చదువు ఖర్చు భరించడానికి ముందుకొచ్చాడు. అయితే తర్వాత రాంబాబు ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకోవాలని కండిషన్. తన కొడుకు భవిష్యత్తు అయినా సుఖంగా వుంటుందని భావించి అందుకు కృష్ణమూర్తి అంగీకరించాడు.

రాంబాబు ఇక కాలేజీలో చేరడమే తరువాయి.

కృష్ణమూర్తి గుండె పోటొచ్చి ఆఫీసు కుర్చీలోనే కళ్ళు మూశాడు.

రాంబాబు పేక మేడలు కూలిపోయాయి.

అక్క పెళ్ళి, తల్లి పోషణ, తమ్ముళ్ళ బాధ్యత ఒక్కుమ్మడిగా రాంబాబు మీద పడ్డాయి.

అప్పటికి రాంబాబుకి పదిహేడు సంవత్సరాలు నిండాయి. మరో సంవత్సరం ఆగి రాంబాబుకి తండ్రి పనిచేసిన ఆఫీసులోనే గుమస్తా ఉద్యోగం ఇచ్చారు. ●